సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 25 । మార్చి । 2024



రూ.1,00,116 విరాళం
అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బల్ల కోట శివప్రసాద్ (చెల్లూరు) ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేశారు.



వాడపల్లిలో రూ.లక్ష విరాళం
ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వత్సవాయి సాయి (హైదరాబాద్) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



	ఇఫ్తార్ సోమ (సా॥)	సెహరీ మంగళ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.42
కాకినాడ	6.24	4.42
అమలాపురం	6.24	4.42

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రేపటి నుంచి మరో రెండు పరీక్ష పత్రాల మూల్యాంకనం
– డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షా పత్రాల మూల్యాంకనంలో భాగంగా ఈ నెల 26 నుంచి చరిత్ర, రసాయన శాస్త్రం పరీక్షా పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్ ఆఫీసర్, జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) వనుము సోమశేఖరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ వాల్యుయేషన్ క్యాంపులో ఇంటర్మీడియెట్‌కు సంబంధించి పలు పరీక్షల పత్రాలు దిద్దుతున్న విషయాన్ని డీఐఈవో గుర్తు చేశారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ మూల్యాంకన ప్రక్రియను వచ్చే నెల ఏప్రిల్ 3వ తేదీ నాటికి పూర్తి చేసేలా బోర్డు కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ దిశగా మూల్యాంకనం పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి
అమలాపురం రూరల్: ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ రకాల ప్రింటింగ్ ప్రెస్‌లు, ముద్రణ సంస్థలు.. కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ప్రింటింగ్ విషయంలో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ప్రజాప్రాతి నిధ్య చట్టం -1951లోని 127ఏ ప్రకారం కరపత్రాలు, పోస్టర్లు ముద్రించినపుడు సంబంధిత పత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామా స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు. పబ్లిషర్ చిరునామా, ముద్రించిన కాపీలను రెండింటిని వెంటనే జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కిక్కిరిసిన అయినవిల్లి



స్వామివారి సన్నిధిలో భక్తులు


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 29 మంది, ప్రత్యేక దర్శనంలో 425 మంది, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 15 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. 21 మంది తమ నూతన వాహన పూజలు, నలుగురు చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. అయిదుగురు భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,62,400 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

కొత్తవారికే ఆదరణ

- కోనసీమ జిల్లాలో రెండు చోట్ల జనసేన పోటీ
- ఇద్దరు అభ్యర్థులూ ఇటీవల పార్టీలోకి వచ్చిన వారే
- స్థానికులే అయినా పరిచయాలు తక్కువ
- జెండా మోసిన వారికి మొండి చేయి
- ఒకే ఒక్క బీసీ నేత పితానికి ఝలక్
- బీసీ, ఎస్సీ నేతలకు కానరాని ఊరడింపు
- కనీసం నామినేటెడ్ ఊసే లేదు!



శెట్టిబత్తుల రాజబాబు | డి.ఎం.ఆర్. శేఖర్ | పితాని బాలకృష్ణ | బండారు శ్రీనివాసరావు | వేగుళ్ల లీలాకృష్ణ | పోలిశెట్టి చంద్రశేఖర్



సాక్షి అమలాపురం: జన 'సేనాధిపతులు'గా కీర్తనలందుకున్న వారు ఇప్పుడు జనసేన 'బాధితులుగా' మారిపోయారు. ఏళ్ల పాటు పార్టీ కోసం జెండా మోసినవారు.. పార్టీ ఉనికి కోసం అహర్నిశలు పనిచేసినవారు.. సొంత సొమ్ముతో నియోజకవర్గంలో పార్టీని నడిపించిన ఇన్‌చార్జిలు ఇప్పుడు పార్టీ నిరాదరణకు గురవుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పొత్తుల ఎత్తులలో చిత్తయి... ఆశించిన అభ్యర్థిత్వాన్ని పొందలేదు సరికదా... ఉమ్మడి జెండాలు మోయాల్సిన దుస్థితి. నిన్నటి వరకు రాజకీయంగా వ్యతిరేకించిన వారినే ఇప్పుడు కౌగిలించుకోవలసి రావడం జనసేన పార్టీ ఇన్‌చార్జిలకు మింగుడుపడని అంశంగా మారింది.

ఉమ్మడి అభ్యర్థుల ఖరారు

కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు ఖరారయ్యారు. అమలాపురం లోక్‌సభ స్థానానికి టీడీపీ పోటీ చేస్తుండగా, ఏడు అసెంబ్లీ సీట్లలో ఒక్క చోట కూడా బీజేపీకి అవకాశం రాలేదు. జనసేన రాజోలు, పి.గన్నవరంలో పోటీ చేస్తుండగా, టీడీపీ ఐదు చోట్ల పోటీ చేస్తోంది. జనసేన పోటీ చేస్తున్న రెండుచోట్లా అభ్యర్థులు పార్టీలోకి ఈ మధ్యకాలంలో వచ్చినవారే కావడం విశేషం. పైగా ఆర్థికంగా స్థితిమంతులు. పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ స్థానికుడే అయినా తెలంగాణ క్యాడర్ ఉద్యోగి. జనసేన నుంచి టిక్కెట్ హామీ వచ్చిన తరువాత ఉద్యోగానికి జనవరి 31న వలంటరీ రిటైర్‌మెంట్ ప్రకటించారు. పార్టీలో రెండు నెలల నుంచి మాత్రమే చురుగ్గా ఉన్నారు.

ఇక్కడ తొలుత టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్‌కుమార్ (మహాసేన రాజేష్)ను ఎంపిక చేశారు. అయితే అతనిపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో జనసేనకు అవకాశం ఇచ్చారు. ఖర్చుకు వెనుకాడనని గిడ్డి భరోసా ఇచ్చిన తరువాతనే అతని అభ్యర్థిత్వాన్ని జనసేనతోపాటు టీడీపీ అంగీకరించింది.

శెట్టిబత్తుల, శేఖర్‌లకు షాక్

ఇక రాజోలు అభ్యర్థి దేవ వరప్రసాద్ ప్రచారం మొదలు పెట్టారు. ఈయన స్థానికుడే అయినా పార్టీలో చేరి రెండేళ్లు కావస్తున్నా స్థానికంగా పెద్దగా పరిచయాలు లేవు. కేవలం పార్టీలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలను మాత్రమే పర్యవేక్షించేవారు. స్థానికంగా రాపాక రమేష్‌బాబు పార్టీ జెండా మోసేవారు. ఇతనితోపాటు బొంతు రాజేశ్వరరావు స్థానికంగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేవారు. వీరిద్దరికీ పార్టీ మొండిచేయి చూపినట్టయ్యింది. అమలాపురం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న శెట్టిబత్తుల రాజబాబు, పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న డి.ఎం.ఆర్.శేఖర్‌లకు సైతం ఊహించని షాక్ తగిలింది. పార్టీ ఆవిర్భావం నుంచి వీరు చురుగ్గా పనిచేస్తున్నారు. అమలాపురం పార్లమెంట్ లేదా అమలాపురం అసెంబ్లీలో ఒకచోట నుంచి జనసేన పోటీలో ఉంటుందని క్యాడర్ ఆశించింది. అమలాపురం నుంచి పోటీ తమ పార్టీ ఆత్మగౌరవంగా జనసేన క్యాడర్ చెప్పుకొంది. పార్టీ అధినేతను కలిసిన ప్రతిసారీ స్థానిక నాయకులే కాకుండా జిల్లాలో కీలక నేతలు సైతం పొత్తులో అమలాపురం అసెంబ్లీ స్థానాన్ని పార్టీ తీసుకోవాల్సిందిగా కోరుతూ వచ్చారు. ఒకానొక సమయంలో అమలాపురం జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. చంద్రబాబు కోరడంతో పవన్ దీనిని సులువుగా వదిలేసుకున్నారు.

బీసీ నేతకు జెల్ల

పార్టీలో సీటు ఆశించిన బీసీ నేత, శెట్టిబలిజ వర్గానికి చెందిన పితాని బాలకృష్ణను పక్కన పెట్టారు. గత ఎన్నికలలో రాష్ట్రంలోనే తొలి జనసేన అభ్యర్థిగా పితాని ముమ్మిడివరం నుంచి పోటీ చేయగా, ఈసారి టీడీపీ కోరుకోవడంతో ఈయనను పక్కన పెట్టారు. కనీసం పార్టీ అధినేత నుంచి ఎటువంటి హామీ లేకుండానే పితానికి పక్కనబెట్టడం గమనార్హం. ఉమ్మడి గోదావరి జిల్లాలలో జనసేన నుంచి సీటు కోరుకున్న ఏకైక శెట్టిబలిజ నేత పితాని పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన వారి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

పవన్ అపాయింట్‌మెంట్‌కు నోచని వైనం

మండపేట, కొత్తపేట, రామచంద్రపురం పార్టీ ఇన్‌చార్జిలుగా వేగుళ్ల లీలాకృష్ణ, బండారు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్ పార్టీకి సేవలందించారు. వీరందరికీ సైతం పవన్ ఝలక్ ఇచ్చారు. లీలాకృష్ణ, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ గత ఎన్నికలలో పోటీ చేసి ఓటమి చెందినా పార్టీని వీడకుండా నియోజకవర్గంలో పనిచేస్తూ వచ్చారు. పొత్తుల కారణంగా అవకాశం కోల్పోతున్నామని, ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏదైనా నామినేటెడ్ పదవి ఇస్తామనే భరోసా కూడా అధినేత నుంచి రాలేదు. వీరిలో చాలామందికి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదు. పార్టీ పెద్దలు పిలిచి అనునయించే పనికూడా చేయలేదు. ఏళ్లపాటు పార్టీకోసం వ్యయప్రయాసలకు ఓర్చి పనిచేస్తే ఇలా కరివేపాకులా తీసిపరేశారని ఇన్‌చార్జిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఈ జిల్లా పరిధిలో జనసేనకు 29 శాతం వరకు ఓటింగ్ వచ్చింది. అటువంటి చోట రెండు స్థానాలు మాత్రమే పోటీ చేయడంపై పార్టీకి మింగుడుపడని అంశంగా మారింది. ఇన్‌చార్జిలే కాకుండా పార్టీ మీద నమ్మకంతో నాయకులు, క్యాడర్ సొంత సొమ్ము భారీగా ఖర్చు చేశారు. ఇప్పుడు వీరంతా టీడీపీ జెండా మోయాల్సి వచ్చింది. 'టీడీపీలో రాజకీయ అణచివేత కారణంగా గత ఎన్నికల ముందు ఎంతోమంది ఆ పార్టీని వీడి జనసేనలో చేరాం. పార్టీ అధినేత పవన్ నిర్ణయం వల్ల ఇప్పుడు తిరిగి మరోసారి టీడీపీ జెండా మోయాల్సి రావడం మా దురదృష్టం' అని నాయకులు వాపోతున్నారు.

కాటన్ విగ్రహానికి ముసుగు తొలగించారు



ముసుగు తొలగించిన తర్వాత కాటన్ విగ్రహం

సాక్షి ఇంపాక్ట్

ఉప్పలగుప్తం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక రాజకీయ నాయకుల విగ్రహాలకు వేయాల్సిన ముసుగు అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి సైతం కప్పేశారు. దీనిపై 'కాటన్ మహాశయా క్షమించు' అంటూ ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రత్యేకమైన కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించి ఎన్నికల నియమావళి ప్రకారం సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ముసుగు అవసరం లేదని తెలుసుకున్న అధికారులు ఆదివారం దాన్ని తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు, కాటన్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

లోవలో భక్తుల కోలాహలం
తుని రూరల్: లోవ దేవస్థానంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 10 వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,10,550, పూజా టికెట్లకు రూ.95,130, కేశఖండనలకు రూ.12,040, వాహన పూజలకు రూ.4,700, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.53,512, విరాళాలుగా రూ.41,100 కలిపి అమ్మవారికి మొత్తం రూ.3,17,032 ఆదాయం సమకూరిందని వివరించారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.10 అడుగులుగా నమోదైంది.

12.68 లక్షల కిలోల పొగాకు విక్రయాలు



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు

- కిలో గరిష్ఠ ధర రూ.241
- నగటు ధర రూ.239.49
- 10,335 బేళ్ల కొనుగోలు

దేవరపల్లి: పొగాకు వేలం కేంద్రాల్లో ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. పొగాకు వేలం ప్రారంభించి 19 రోజులు కాగా, ఇప్పటి వరకూ 14 రోజుల పాటు వేలం జరిగింది. మన జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, ఏలూరు జిల్లాలోని కొయ్యలగూడెంతో పాటు, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రారంభ ధర నిలకడగా కొనసాగుతున్నందున బేళ్లు తక్కువగా వస్తున్నాయి. ఈ నెల 6న రెండు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల్లో కిలో గరిష్ఠ ధర రూ.240తో వేలం ప్రారంభించారు. నేటికీ అదే ధర పలుకుతూండటంతో రైతులు వేలం కేంద్రాలకు తక్కువ బేళ్లు తీసుకుని వస్తున్నారు. లో గ్రేడ్, మధ్యస్థ గ్రేడ్‌ల రకం పొగాకును వేలానికి తీసుకుని వస్తున్నారని అధికారులు తెలిపారు. మరో రెండు వారాలు మార్కెట్ ఇదే విధంగా ఉంటుందని, ఏప్రిల్ మొదటి వారం నుంచి ధర పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. క్యూరింగ్‌లు చివరి దశకు రావడంతో గ్రేడింగ్‌లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సాగు విస్తీర్ణం పెరిగినందున ఉత్పత్తి 65 మిలియన్ల కిలోలకు చేరుతుందని అధికారులు, రైతుసంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఐదు వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకూ రూ.30.30 కోట్ల విలువైన 12.68 లక్షల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. రైతులకు కిలోకు గరిష్ఠ ధర రూ.241, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.239.49 లభించాయని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 73,075 కిలోలు, జంగారెడ్డిగూడెం-1లో 3,96,451 కిలోలు, జంగారెడ్డిగూడెం-2 కేంద్రంలో 3,61,866 కిలోలు, కొయ్యలగూడెంలో 2,57,482 కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 1,79,484 కిలోల చొప్పున పొగాకు విక్రయాలు జరిగాయి. దేవరపల్లిలోనే కొనుగోళ్లు తక్కువగా జరిగాయి.

పగలు ఉడుకు... రాత్రి వణుకు

- భిన్న వాతావరణ పరిస్థితులు
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

అంబాజీపేట: పగలు ఎండ వేడిమి... రాత్రి సమయాల్లో చలితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా... రాత్రి చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కొద్దిరోజులుగా తెల్లవారుజామున దట్టమైన మంచు కురుస్తోంది. సాధారణంగా శివరాత్రి వస్తే శివ శివా అంటూ చలిగాలులు వెళ్లిపోతాయని చెబుతుంటారు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా మార్చి నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. మరోవైపు గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో చలిగాలులు పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని పరిసర ప్రాంతాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. సోమవారం తెల్లవారుజామున 24 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మధ్యాహ్నం 36 డిగ్రీల పైబడి నమోదవుతోంది. రాత్రి సమయాల్లో చలిగాలుల తీవ్రత అధికమవుతోంది. తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంటోంది. వాతావరణంలో భిన్న మార్పుల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. రెండు నెలలుగా శీతాకాలం కావడంతో ఏసీలు, ఫ్యాన్ల వినియోగం తగ్గింది. అయితే గణనీయంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో ఏసీలు, ఫ్యాన్ల వాడకం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వాడకం పెరుగుతోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



పెరిగిన ఎండలతో నిర్మానుష్యంగా ఉన్న అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్

ఓటరుకు డిజిటల్ బాసట

- అందుబాటులో ఏడు యాప్‌లు
- క్షణాల్లో ఫిర్యాదుకు అవకాశం
- నిమిషాల్లో పరిష్కారం

అంబాజీపేట: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో సామాన్య పౌరులను ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. సీ విజిల్, సువిధ, అబ్జర్వర్, సాక్ష్యం, కేవైసీ, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్, ఓటరు హెల్ప్ యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్నికలకు సంబంధించి సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుకు, ఎన్నికల నియమావళి, ఓటర్లకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల సమాచారం తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి.

సీ విజిల్

ఈ యాప్‌లో ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా పొందుపర్చవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఓటర్లను ప్రభావితం చేసే ఫొటో లేదా వీడియో, ఆడియో క్లిప్‌ను అప్‌లోడ్ చేయాలి. యాప్‌లో వివరాలు పొందుపర్చగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు.

సువిధ యాప్


సువిధ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తోంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి వివరాలు తెలుసుకోవచ్చు. అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని చూడవచ్చు. సువిధ క్యాండిడేట్ యాప్‌ను ఉపయోగించడానికి, అభ్యర్థులు ఖాతాను రిజిస్టర్ చేసుకుని వారి ఆధారాలతో లాగిన్ చేయాలి.

సాక్ష్యం యాప్

దివ్యాంగుల కోసం దీన్ని తీసుకువచ్చారు. ఈ యాప్‌తో పోలింగ్ రోజు వీల్ చైర్ కోసం రిక్వెస్ట్ చేయొచ్చు. దృష్టి లోపం ఉన్న దివ్యాంగుల కోసం వాయిస్ సహాయాన్ని అందిస్తుంది. దివ్యాంగులకు ఉపయోగపడేలా ఓటు వేయడానికి, నమోదు చేయడానికి, పోలింగ్ స్టేషన్ తెలుసుకోవడానికి తదితర అంశాలకు ఇది ఉపయోగపడుతుంది.

అబ్జర్వర్ యాప్

ఇది ఎన్నికల కోడ్ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలుసుకోవడానికి పరిశీలకులకు ఉపయోగపడుతుంది. యాప్‌ను ఉపయోగించడానికి పరిశీలకులు ముందుగా ఖాతాను సృష్టించి వారికోడ్, పాస్‌వర్డ్‌తో సమాచారాన్ని అందించాలి. పోలింగ్ స్టేషన్ సంఖ్య, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారం తెలుసుకోవచ్చు.



సీ విజిల్ యాప్

ఓటరు హెల్ప్‌లైన్ యాప్

ఈ యాప్ ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో జనాభా వివరాలు, ఎలక్టోరల్ రోల్‌లో పేరును సెర్చ్ చేయడం తెలుసుకోవచ్చు. ఓటు వేయడానికి అర్హత ఉందో లేదో తనిఖీ చేయడానికి యాప్‌ని ఉపయోగించవచ్చు. డిజిటల్ ఫొటో ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కేవైసీ యాప్ (నో యువర్ క్యాండిడేట్)

మీ అభ్యర్థిని తెలుసుకోవడానికి, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్ర గురించి తెలుసుకొనేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. అభ్యర్థిపై క్రిమినల్ కేసుల వివరాలు, ఆ కేసుల స్థితి, నేరాల స్వభావం ఉంటాయి.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి ఈసీకి సహాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఓటరు మొబైల్ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లో తన ప్రొఫైల్‌ను నమోదు చేసుకోవచ్చు. ఇందులో ఓటరు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. ఫిర్యాదు అనంతరం ఎన్నికల అధికారి నిర్ణీత వ్యవధిలోగా స్పందించాల్సి ఉంటుంది. తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో ట్రాక్ చేయవచ్చు.

నిర్మలగిరి.. కోటి కాంతుల సిరి..

- విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతున్న నిర్మలగిరి
- వైభవంగా సాగుతున్న మేరీమాత ఉత్సవాలు
- తరలివస్తున్న భక్తులు



విద్యుద్దీప కాంతుల్లో చర్చి

దేవరపల్లి: బాల ఏసును దర్శించుకునేలా జ్ఞానులకు మార్గనిర్దేశం చేసింది ఆకాశంలోని ఒక నక్షత్రం. అటువంటి కోటానుకోట్ల తారకలు.. ఆ నింగి నుంచి ఈ నేల పైకి దిగివచ్చాయా అనే రీతిలో క్రైస్తవుల పరమ పావన క్షేత్రం నిర్మలగిరి మెరిసిపోతోంది. గౌరీపట్నంలోని నిర్మలగిరిలో అత్యంత వైభవంగా జరుగుతున్న మేరీమాత ఉత్సవాల సందర్భంగా.. ఈ పుణ్యక్షేత్రాన్ని రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో అందంగా అలంకరించారు. సుమారు 100 ఎకరాల్లో విస్తరించిన ఈ పుణ్యక్షేత్రంలోని కలవరి కొండపై ఉన్న క్రీస్తు ఆలయం, దిగువన ఉన్న ప్రార్థనా మందిరం, ప్రధాన ద్వారం వద్ద గల మరియ తల్లి స్వరూప మండపం విద్యుద్దీప కాంతులతో కొత్త శోభను అద్దుకున్నాయి. రాత్రయితే చాలు.. ఈ పుణ్యక్షేత్రం కోటి కాంతులు విరజిమ్ముతూ ధగద్ధగాయమానంగా మెరిసిపోతోంది. నిర్మలగిరి క్షేత్రంలో ఈ నెల 22న ప్రారంభమైన మేరీమాత ఉత్సవాలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. రాత్రి సమయంలో బస్సులు, ట్రాక్టర్లు, లారీలు, కార్లపై ఇక్కడకు చేరుకుంటున్నారు. కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణను కన్నులారా తిలకించేందుకు.. మతాలకు అతీతంగా తరలివస్తున్నారు. మరియ తల్లికి పూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టి, తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటున్నారు. కల్వరి కొండపై ఉన్న ఏసుక్రీస్తు ఆలయానికి మెట్లపై మోకాళ్లతో నడిచి వెళ్లి మొక్కులు చెల్లిస్తున్నారు. ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల చివరి రోజున భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

కొండంత అభిమానం.. గోరంత అనురాగం!



ఎడమ చేతి చిటికిన వేలుపై వైఎస్సార్ సీపీ జెండా రంగు వేసుకున్న తలారి దొరబాబు

సామర్లకోట: తన ఎడమ చేతి చిటికెన వేలు గోరుపై వైఎస్సార్ సీపీ జెండా మూడు రంగులు వేసుకొని మురిసిపోతున్నారు ఆ నాయకుడు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న వీకే రాయపురం గ్రామానికి చెందిన తలారి దొరబాబు 22 ఏళ్లుగా గోరును నాలుగు అంగుళాల పొడవు తగ్గకుండా చూసుకుంటున్నారు. 2004లో తోట గోపాలకృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ రంగును గోరుపై వేయడంతో ఆయన విజయం సాధించారు. ఆ సెంటిమెంట్‌తో ప్రస్తుతం వైఎస్సార్ సీపీ జెండా రంగును గోరుపై వేసుకొన్నానన్నారు. కారు నడపడం, పొలం, డెయిరీ పనులను స్వయంగా చూసుకొంటూ మరోపక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ గోరును కాపాడు కోవడంతో ఆయనకు పార్టీపై ఎంత అభిమానం ఉందో అర్థం అవుతుంది.

అనాథకు అంత్యక్రియలు



కొండా శ్రీనుకు సపర్యలు చేస్తున్న రాంబాబు

అమలాపురం రూరల్: బండారులంకలో అయిన వారందరినీ విడిచి పెట్టి రోడ్డు పక్కన ఒంటరిగా జీవిస్తున్న కొండా శ్రీను (40) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఫ్రీ టైమ్ సర్వీస్ సభ్యులు మానవతా దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఫ్రీ టైమ్ సర్వీసు వ్యవస్థాపకుడు తులా రాంబాబు రోజూ మాదిరిగానే ఆహార పొట్లం అందించేందుకు వచ్చాడు. అప్పటికే కొన ఊపిరితో ఉన్న శ్రీనును నీడకు చేర్చి సపర్యలు చేశాడు. కొద్దిసేపటికే ప్రాణం విడిచి పెట్టాడు. దీంతో అన్నీ తామై ఫ్రీ టైమ్ సర్వీసు సభ్యులు బండారులంక శ్మశాన వాటికలో శ్రీను అంత్యక్రియలు నిర్వహించారు. ఫ్రీ టైమ్ సర్వీసు సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ఎన్నికల పాఠం

- సాంఘిక శాస్త్రంలో 'ఎన్నికల ప్రక్రియ'
- విద్యార్థులకు ఓటు విలువ తెలియజేసేందుకు..
- ప్రజాస్వామ్యంపై అవగాహనకు దోహదం

రాయవరం: వంద శాతం పోలింగ్ కావాలంటే విద్యార్థుల పాత్ర కీలకం. విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తే తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వారితో ఓటు వేయిస్తారు. అందుకే విద్యార్థి దశ నుంచే సాంఘిక శాస్త్రంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పాఠం ముద్రితమైంది. ఇది ప్రజాస్వామ్యం, ఓటు హక్కు విలువను తెలియజేసేందుకు ఉపయోగపడుతుంది. ఎన్నికల వ్యవస్థ నుంచి ఓటు హక్కు వినియోగం వరకు విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా పాఠ్యాంశం రూపొందించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల అవసరాన్ని గుర్తించి 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడింది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం 1952లో తొలి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించగా, ఆ ఎన్నికల్లో 17.32 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారు. ప్రస్తుతం దేశంలో ఓటర్ల సంఖ్య 92 కోట్లకు చేరింది.

6వ తరగతి నుంచి..

విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు విలువ, ఎన్నికల విశిష్టతను తెలియజేసేందుకు విద్యార్థులకు పాఠ్యాంశాలను సాంఘికశాస్త్రంలో పొందుపర్చారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాల దశలోనే విద్యార్థులకు పరిచయం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థ, కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు ఇలా పలు అంశాలను విద్యార్థులకు పరిచయం చేశారు.



8వ తరగతిలో మనకు పార్లమెంట్ ఎందుకు అవసరం? పాఠ్యాంశంలో ఒక పేరా



తొమ్మిదో తరగతిలో ఎన్నికలకు సంబంధించిన పాఠ్యాంశం

▶▶ 6వ తరగతిలో ప్రభుత్వం అంటే ఏమిటి? ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్య, పార్లమెంటరీ వ్యవస్థ, కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు, అధిక ఓటర్లు తీసుకునే నిర్ణయం, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించే ప్రభుత్వం, ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధిని ఎన్నుకునే విధానం, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే విధానం, నమూనా ఎన్నికల నిర్వహణ గురించి వివరించారు. మెజారిటీ పాలన, ఆర్టికల్ 326, విశ్వజనీన వయోజన ఓటు హక్కు గురించి వివరించారు.

▶▶ 7వ తరగతిలో సార్వజనీన వయోజన ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, గణతంత్రం, రాజ్యాంగ రూపకల్పనా చరిత్ర, ప్రాథమిక హక్కులు, విధులు, బాధ్యతాయుతమైన పౌరసత్వం, దేశభక్తి, స్వీయ క్రమశిక్షణ, శాసనసభ్యుని ఎన్నిక, రహస్య ఓటింగ్ విధానం తదితర భావనలను విద్యార్థులకు పరిచయం చేశారు.

▶▶ 8వ తరగతిలో మనకు పార్లమెంట్ ఎందుకు అవసరం? పార్లమెంట్ ఎలా ఏర్పడుతుంది? రాజ్యాంగంలో సార్వత్రిక ఓటు హక్కు ఎలా ప్రవేశ పెట్టారు? ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగం, 2004 సాధారణ ఎన్నికల నుంచి వినియోగించిన విధానం, ఈవీఎంల వినియోగించడం వల్ల 1,50,000 చెట్లను రక్షించుకోగలగడం, బ్యాలెట్ పత్రాల ముద్రణకు అవసరమయ్యే 8వేల టన్నుల కాగితం ఉపయోగపడిన అంశం తదితర విషయాలను వివరించారు.

▶▶ 9వ తరగతిలో 'ఎన్నికల రాజకీయాలు' అనే చాప్టర్‌లో భారతదేశంలో ఎన్నికలను మదింపు చేయడం, వివిధ నియోజకవర్గాల మధ్య సరిహద్దు రేఖలను నిర్ణయించడం, ఎన్నికల ఫలితాలను ప్రకటించే వరకు ఎన్నికల్లో వివిధ దశలను వివరించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా చూడడంలో ఎన్నికల సంఘం పాత్రను వివరించారు. భారతదేశంలో ఎన్నికల విధానం, రిజర్వ్ నియోజకవర్గాలు, ఓటర్ల జాబితా, అభ్యర్థులు నామినేషన్ వేసే విధానం, విద్యార్హతలు, పోలింగ్ జరిగే విధానం, ఓట్ల లెక్కింపు తదితర విషయాలను ప్రస్తావించారు. ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి వివరిస్తూనే ఎన్నికలు ప్రకటన చేసినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల సంఘం నిర్వహించే ప్రతి అంశాన్ని పాఠ్యాంశాల్లో పొందుపర్చారు. ఎన్నికల సంఘం విధులకు సంబంధించి చక్కటి ఫొటోలతో, విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠ్యాంశాల రూపకల్పన చేపట్టారు.

ఎన్నికల సంఘం పనితీరు



విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలో ఎన్నికల విధానం గురించి సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాల్లో చక్కగా వివరించారు. ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇవి దోహదం చేస్తాయి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పవిత్రతను విద్యార్థులకు తెలియజేస్తాయి. ఫలితంగా విద్యార్థులు దేశ భవిష్యత్తును నిర్మించగలుగుతారు.

– కేవీఎస్ కృష్ణారెడ్డి, సాంఘిక శాస్త్ర పుస్తక రచయిత, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, ఈతకోట, రావులపాలెం మండలం

బ్యాలెట్ నుంచి ఈవీఎం వరకు



భారత ఎన్నికల సంఘం, పనితీరు తెలుసుకునే అవకాశం విద్యార్థులకు ఉంది. ఆరు నుంచి పదవ తరగతి వరకు వివిధ అంశాలను పాఠ్యాంశాల్లో పొందుపర్చారు. బ్యాలెట్ నుంచి ఈవీఎంల వరకు ఎన్నికల సంఘంలో వచ్చిన ఆధునిక మార్పులను విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను విద్యార్థులు తెలుసుకుంటున్నారు.

– గరగ సీతాదేవి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, రాయవరం

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

ముమ్మిడివరం: అదనపు కట్నం కోసం భర్త అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారని ఒక మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ దొమ్మేటివారిపాలెంకు చెందిన దొంగ మల్లీశ్వరికి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్‌తో 2020 సంవత్సరంలో వివాహం అయింది. వివాహ సమయంలో రూ.ఐదు లక్షల కట్నం, రూ.రెండు లక్షల ఆడపడుచు కట్నం, రెండు కాసుల బంగారం, సారె సామానులు తమ పుట్టింటివారు పెట్టారని తెలిపింది. ఇంకా అదనపు కట్నం కావాలని భర్త కిరణ్‌కుమార్ మరిది నానాజీ, ఆడపడుచు హరిణి వేధింపులకు గురి చేస్తున్నారని మల్లీశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌సీహెచ్ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తను కత్తిపీటతో గాయపరిచిన అల్లుడు

ఐ.పోలవరం: మండలంలోని ఇలపల్లిపాకలు గ్రామానికి చెందిన వాసంశెట్టి మంగను ఆమె అల్లుడు కత్తిపీటతో గాయపరచడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు ఆదివారం తెలిపారు. ఇలపల్లిపాకలు గ్రామానికి చెందిన వాసంశెట్టి మంగ తన కుమార్తెను యానాం చెందిన గీసాల దుర్గమోహన్‌కు ఇచ్చి 2013లో వివాహం చేశారు. కొంతకాలం కాపురం బాగానే సాగింది. గత మూడు సంవత్సరాలుగు తరచు గొడవ పడడంతో మంగ కూతురు పిల్లలతో సహా అమ్మగారి ఇంటికి వచ్చింది. దీంతో అప్పుడప్పుడు పిల్లలను చూడడానికి వచ్చేవాడు. దుర్గమోహన్ ఆదివారం పిల్లలను చూడడానికని వచ్చి అత్త మంగతో గొడవ పడ్డాడు. కత్తి పీట అత్తగారి తలపై ,చేయిపై గాయపరిచాడు. ఆమెను అనపర్తి సీహెచ్‌సీ తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మాచరయ్య (ఫైల్)

కొత్తపేట: స్థానిక బోడిపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బాబాకాలనీకి చెందిన కర్రి మాచరయ్య (39) శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా అమలాపురం నుంచి రావులపాలెం ముగ్గురు యువకులు మోటార్ సైకిల్‌పై వెళుతూ ఢీకొనడంతో మాచరయ్యతో పాటు ఇద్దరు యువకులు తీవ్రంగా, మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మాచరయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ యువకులను ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడు మాచరయ్య బంధువులు ఆందోళన చేశారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మృతుని బంధువులను పరామర్శించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను కోరారు.

సత్యదేవునికి పెద్ద రథం

- 80 శాతం పూర్తయిన పనులు
- రూ.1.08 కోట్లతో చురుకుగా నిర్మాణం
- చక్రాలు అమర్చితే తయారీ పూర్తయినట్టే

అన్నవరం: ఈ ఏడాది మే 18 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవారు నూతన టేకు రథంపై ఊరేగనున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాకారంలో ప్రతీ ఆదివారం సత్యదేవుడు, అమ్మవారిని చిన్న టేకు రథంపై ఊరేగిస్తున్న విషయం తెలిసిందే.

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో స్వామివారి ఊరేగింపు కోసం సుమారు 36 అడుగుల ఎత్తు కలిగిన పెద్ద టేకు రథం తయారవుతోంది. నాణ్యమైన టేకుతో అనుభవజ్ఞులైన శిల్పులు ఆరు నెలలుగా ఈ రథం తయారు చేస్తున్నారు. ఈ రథం పైభాగంలో గోపురాన్ని ఆదివారం అమర్చారు. దీంతో దాదాపు 80 శాతం పనులు పూర్తి కాగా, రథానికి నాలుగు చక్రాలు, ముందు భాగంలో రెండు గుర్రాలు అమర్చే పని చేయాల్సి ఉంది. ఈ పనులన్నీ ఏప్రిల్ నెలాఖరుకు పూర్తవుతాయని ఆ రథం నిర్మాణ కాంట్రాక్టు పొందిన కొల్లాటి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే వీరి ఆధ్వర్యంలో చిన్న రథం సర్వాంగ సుందరంగా తయారు చేశారు. నెల రోజులుగా ప్రతీ ఆదివారం రత్నగిరిపై సత్యదేవుడు, అమ్మవారిని రత్నగిరి ఆలయ ప్రాకారంలో ఈ చిన్న రథంపై ఊరేగిస్తున్నారు.



పెద్ద రథం గోపురం

పాత రథం స్థానంలో కొత్తగా పెద్దది

సత్యదేవుని కల్యాణమహోత్సవాలలో గ్రామంలో ఊరేగించేందుకు సుమారు 40 ఏళ్ల క్రితం తయారు చేసిన వెండి రథం ఉంది. ఈ రథాన్ని రత్నగిరిపై స్వామివారి ఉత్సవాలలోను, వార్షిక కల్యాణ మహోత్సవాలలో కొండదిగువన జరిగే ఊరేగింపులో ఉపయోగిస్తున్నారు. ఈ రథం శిథిలావస్థకు చేరినందున టేకుతో రెండు రథాలు రూపొందించాలని భక్తులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. దీంతో గత ఏడాది ఆగస్టులో రూ.1.42 కోట్ల వ్యయంతో నాణ్యమైన బస్తరు టేకుతో రెండు రథాలను నిర్మించేందుకు అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ టెండర్లు పిలిచి ఖరారు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లకు చెందిన శ్రీమాణిక్యాంబ శిల్పకళ ఉడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్ ఈ రథం తయారీ టెండర్లు దక్కించుకున్నారు. వీటిలో రూ.34 లక్షలు వ్యయంతో చిన్న రథం, రూ.1.08 కోట్ల వ్యయంతో పెద్ద రథం నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకు చిన్న రథం, సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో కొండ దిగువన ఊరేగించేందుకు పెద్ద రథం ఉపయోగించాలన్నది అధికారుల భావన. అయితే ముందుగా చిన్నరథం నిర్మాణం ప్రారంభించి పూర్తి చేశారు. ఇప్పుడు పెద్ద రథం పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

35.8 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పున పెద్ద రథం

తయారవుతున్న పెద్ద రథం ఎత్తు 35.8 అడుగులు కాగా, వెడల్పు 14.6 అడుగులు. 21 అడుగుల పొడవు, చక్రాలు ఎత్తు ఆరు అడుగులు. ముందు భాగంలో రెండు గుర్రాలు ఉంటాయి. గుర్రాలు నాలుగు అడుగుల పొడవు, మూడు అడుగుల ఎత్తున ఉంటాయి. చక్రాలపై అందమైన లతలు చెక్కనున్నారు. రథం మీద దేవతామూర్తులు, పలు ఆకర్షణీయమైన డిజైన్లు చిత్రీకరించనున్నట్లు నిర్మాణ కాంట్రాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 20కి పైగా శిల్పులు పెద్ద రథం పనిలో నిమగ్నమై ఉన్నారని ఆయన తెలిపారు. పెద్ద రథాన్ని మూడు అంతస్థులలో రూపొందించి దానిపై గోపురం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



సత్యదేవుని పెద్ద టేకు రథం

ఏప్రిల్ నెలాఖరుకు సిద్ధం



ప్రస్తుతం రథం చక్రాలు రూపొందించే పనిలో ఉన్నాం. ఈ పనులు పూర్తయితే రథం సిద్ధమైనట్టే. మే 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలకు ఈ రథం తయారు చేయాలని ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. అయితే ఏప్రిల్ నెలాఖరుకే ఈ రథం పనులు పూర్తి చేసి దేవస్థానానికి అందజేయాలని భావిస్తున్నాం. మా నాన్న కొల్లాటి కామేశ్వరరావు దేవుళ్ల రథాల తయారీలో సిద్ధహస్తులు. వారి వద్దనుంచి ఈ విద్య నేర్చుకున్నాను. మొత్తం 20 మంది ఇక్కడ పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు 50 రథాలు తయారు చేశాం. ప్రస్తుతం ఉన్న అంతర్వేది దేవస్థానం రథం తయారీలో కూడా పాల్గొన్నాం. రథానికి నాణ్యమైన బస్తరు టేకు వాడుతున్నాం. వంద సంవత్సరాల వరకు చెక్కు చెదరదు.

– కొల్లాటి శ్రీనివాస్, నిర్మాణ కాంట్రాక్టర్

ఆకుకూరలతో ఆరోగ్యం

- పుష్కలంగా విటమిన్లు, పోషకాలు
- కోవిడ్–19 తరువాత పెరిగిన వినియోగం



ఆలమూరు: కోవిడ్–19 తరువాత సంభవించిన పరిణామాల దృష్ట్యా ప్రజల ఆహారపు అలవాట్లలో స్పష్టమైన మార్పులు వచ్చాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ దానికనుగుణంగా ఆహారపు ఆలవాట్లను మార్చుకుంటున్నారు. జీవవ విధానాన్ని సరళతరం చేసుకుని 'ఆరోగ్యమే మహా భాగ్యం' అనే నానుడికి జీవం పోస్తున్నారు. మాంసాహారం, పప్పుదినుసులతో పాటు 'రక్షిత ఆహారంగా భావించే ఆకుకూరలను విరివిగా ఉపయోగిస్తున్నారు. పోషక విలువలు, విటమిన్లు అధికంగా ఉండి అందుబాటు ధరల్లో లభించే ఆకు కూరలను కొనుగోలు చేయడానికి అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఆకుకూరల్లో ఇనుప ధాతువులు, ఖనిజ పోషకాలు అధికంగా ఉంటాయి. ప్రజల అభిరుచిని గమనించిన చిరు వ్యాపారులు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ ద్విచక్ర వాహనాలపై తాజా ఆకుకూరలను తీసుకు వచ్చి ఉదయాన్నే విక్రయించడం పరిపాటిగా మారింది. దీంతో పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలలో కూడా ఆకుకూరల వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. పోషక విలువలు, పలురకాల విటమిన్లు కలిగిన ఆకుకూరలు ఎక్కువగా తినడం మంచిదని వైద్యులు సూచించడం కూడా వినియోగం పెరగడానికి కారణమవుతోంది.

విస్తృతంగా ఆకు కూరల సాగు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక ప్రాంతాల్లో విరివిగా ఆకుకూరల సాగు జరుగుతోంది. లంక ప్రాంతాల వెంబడి రైతులు సుమారు మూడు వేల ఎకరాల్లో సాగు చేసిన ఆకుకూరలను మడికి, రావులపాలెం, రాజమహేంద్రవరం తదితర మార్కెట్లకు సరఫరా చేస్తున్నారు. పూర్వం అయితే ప్రతీ ఇంటిలో ఉండే పెరట్లో సహజ సిద్ధమైన వాతావరణంలో ఆకుకూరలు, కాయగూరలను పండించేందుకు ఇష్టపడేవారు కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. కోనసీమ జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో ఆకుకూరల సాగు జరుగుతోంది. ఆలమూరు మండలంలోని మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు అనునిత్యం సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, ఆలమూరు, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం మండలాల నుంచి టన్ను మేర ఆకుకూరలు రైతులు తీసుకువచ్చి విక్రయాలు జరుపుతారు.

అందుబాటు ధరల్లో..

తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, మెంతికూర, కొత్తిమీర, కరివేపాకు, మునగాకులు తదితరాలు అనునిత్యం అందుబాటు ధరల్లో మార్కెట్లో లభిస్తున్నాయి. పొన్నగంటి కూర, పాలకూర, మెంతికూర, బచ్చలి కూర ఎక్కువ మొత్తంలో మార్కెట్‌కు వస్తున్నాయి. ఆకుకూరల్లో ఏ,సీ, బీ కాంప్లెక్స్ విటమిన్లు, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెరుగుదలకు, ఎముకల్లో కాల్షియం సాంద్రత పెంచేందుకు, ఊబకాయం తగ్గించేందుకు, రక్తహీనత నివారణకు ఆకు కూరలు ఉపయోగించాలని వైద్యులు చెబుతున్నారు. ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా లభించే విటమిన్ల వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది.

అపోహలు వద్దంటున్న వైద్య నిపుణులు

గోంగూర తింటే వేడి చేస్తుందని, కీళ్ల నొప్పులు, వాతం వస్తాయని, పాలకూర తింటే కిడ్నీలో రాళ్లు పెరుగుతాయనే అపోహలు సరికాదంటున్నారు. పాలకూర తిన్నా మంచినీళ్లు ఎక్కువ తాగితే చెడు ప్రభావం ఉండదని చెబుతున్నారు. ఆకుకూరలను తినడం ద్వారా మేలు ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

పోషక విలువలు అత్యధికంగా ఉంటాయి



పచ్చని ఆకు కూరల్లో కాల్షియం, బీటాకెరోటిన్, విటమిన్–సీ తదితర విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఆకు కూరలను ఎక్కువగా ఉడికించకుండా తింటే ఆరోగ్యానికి మంచిది. కంటి జబ్బులు, రక్తహీనత తదితర రోగాలను దూరం చేయవచ్చు. చక్కెర వ్యాధిగ్రస్తులు ఆకు కూరలు ఎక్కువగా తీసుకొంటే వ్యాధి నియంత్రణలో ఉంటుంది.

– డి.సువర్చలాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

ప్రమాదానికి దారితీసిన మోటార్ సైకిళ్ల పందేలు

- మితిమీరిన వేగంతో ఢీకొట్టిన వైనం
- వ్యక్తికి గాయాలు, ప్రమాదానికి కారకులు మైనర్లే



క్షతగాత్రుడిని తరలిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

గండేపల్లి: ఎవరు వేగంతో నడపగలరన్న పందెంతో నలుగురు యువకులు రెండు మోటార్ సైకిళ్లపై విన్యాసాలు చేస్తూ మితిమీరిన వేగంతో ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిలిస్టును ఢీకొట్టిన ఉదంతమిది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన తాపీమేస్త్రీ జి.శ్రీను మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వైపు వెళుతుండగా అప్పటికే వేగంగా వస్తున్న యువకుల మోటార్ సైకిళ్లలో ఒకటి ఇతనిని బలంగా ఢీకొట్టింది. శ్రీను పైకెగిరి డ్రైనేజీ పక్కనే పడిపోయాడు. ప్రమాదంలో రెండు మోటార్ సైకిళ్ల హేండిల్స్ ఇరుక్కుపోయాయి. ప్రమాద దృశ్యాన్ని చూసిన స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. జరిగిన ప్రమాదంలో శ్రీను కాలుకు తీవ్రగాయమవగా ప్రమాదానికి కారణమైన యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న 108 అంబులెన్స్ ఈఎంటి తాతపూడి సంధ్య, పైలట్ ఎంఎస్ రాజు క్షతగాత్రునికి ప్రథమ చికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల మోటార్ సైకిళ్ల ప్రమాదాలు మైనర్ల వల్లే ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.